కాలింగ్ బెల్ మోగడంతో మెలకువ వచ్చింది వరలక్ష్మికి. ఒక్కసారి కళ్లు తెరిచి చూసి మళ్లీ రగ్గులోకి దూరి పోయింది.

కాసేపు ఆగి మళ్లీ బెల్ మోగింది. ఆగకుండా అలా మోగుతూనే ఉండ టంతో, ఇంట్లో ఎటువంటి అలికిడీ లేక పోవడంతో విసుగొచ్చింది ఆమెకి. చేతికి



దగ్గరలోనే ఉన్న బజర్ నొక్కింది.

కొద్దిసేపట్లో చేతులు తుడుచు కుంటూ లోపలికి వచ్చింది వంటావిడ— "ఏమి టమ్మగారూ?" అంటూ.

"అవతల ఎవరో నిలబడి ఉన్నారు. ఎంతసేపు నుంచి బెల్ వినపడుతున్నా ఎవరూ తలుపు తీయరేం? ... ఏడు కొండలు ఏమయిపోయాడు? నాంచా రయ్య ఇంకా రాలేదా?"

"ఏమోనండమ్మా, వా శ్లైవరయినా తీస్తారు లెమ్మని నే నూరుకున్నాను ఇందాకనుంచి" అంది వంటావిడ.

"చూడు, చూడు ముందు ఎవరో?" అని మళ్లీ రగ్గు కప్పుకుంది.

వంటావిడ అడుగులు దూరమవడం, తలుపు తీసిన చప్పుడు, మాట్లాడిన శబ్దం — అన్నీ వినపడుతూనే ఉన్నాయి. అయితే, మళ్లీ అడుగుల శబ్దం దగ్గ రవడంతో రగ్గులోంచి బయటికి చూసి, "ఎవ రేమిటి?" అంది పెద్దగా.

"నేనేనే, వరం" అంటూ లోపలికి వచ్చాడు ప్రభాకరం.

వచ్చిన మనిషిని చూస్తూనే మత్తు వదిలిపోయింది వరలక్ష్మికి. దిగ్గున లేచి, "ఎప్పుడొచ్చా వన్నయ్యా? ! ఉత్తర మయినా రాయలేదేం?" అవడిగింది హడావుడిగా.

"అనుకోకుండా వచ్చానమ్మా ... బావేరి?"

"కాంపుకి వెళ్లారులే ... లక్ష్మమ్మ గారూ!" అని పెద్దగా పిలిచి, సమాధానం రాకపోయేసరికి బజర్ నొక్కింది. "కూర్చో, అన్నయ్యా! చూడండి, లక్ష్మమ్మగారూ, ఏడుకొండ లేడీ, వచ్చాడా?"

"బాయిలర్ వెలిగిస్తున్నా డమ్మా! నాంచారయ్య దొడ్డి ఊడుస్తున్నాడు. రాత్రి రెండో ఆటకి వెళ్లాడుట. రాత్రి వచ్చి పడుకున్నాననీ మీకు చెప్పమం టున్నాడు" అని నవ్వింది ఆవిడ.

"ఏడవలేకపోయాడు వెధవ ... అంతా కులాసానా, అన్నయ్యా?"

"నిక్షేపంలా ఉన్నారు."

"వదిన ఏమంటోంది?"

"పొరమీద పొర పెరిగి ఈ తలు పంత లావయిపోయింది. అసలు ఒక వయస్సొచ్చాక అలా లావయి పోతారేమో! కష్టం అంతా మగాడిదీ, పట్టుచీరలు కట్టుకుని సుఖపడటం ఆడదాని వంతూను."

"ఏమంత కష్టపెడుతోం దేమిటి వదిన! అసలు క్లబ్బుకి ఒక ఫాషన్, రోజాకో సినిమా, క్లబ్బులా ఉన్నది వస్తే సరిపోయేది ... పాపం, పాతకాలపుది వదిన!"

"పిచ్చిదానా! క్లబ్బులో చేరితే అంతా చూసేది మొగుడి అంతస్తేగా! ఏమని చెప్పుకుంటుంది? బావ పెద్దాఫీసరు కనక నీకు ఇబ్బంది తెలియడం లేదు" అని కాసేపాగి, "మొదట నా క్కాస్త కాఫీ ఇప్పించు. తరవాత నీకు ముఖ్యమైన విషయం చెబుతాను. నే నసలు వచ్చిందీ అందుకే! అది అవగానే నే వెళ్లిపోవాలి" అన్నాడు.

"అదేమిటి, భలేవాడివే! భోజనం చేసి వెడుదువు గాని. అసలు సాయంత్రం బావ వస్తారు కూడా!"

"అలా కాదు. నీతోనే పని. కేవలం నీ మీద ఆశతోనే వచ్చాని రోజు. నెల్లూ రులో కాంపుంది — నిన్న, ఈ రోజు. పెందరకాడే అన్నం వండితే అయిందని పించి వెళ్లిపోతాను. లేదంటే నెల్లూరు భోజనం నాకు చాలా ఇష్టం. 'ఏ' క్లాసు బియ్యం."

"సర్లే, ఇక్కడా అవే పెడతారులే! నువ్వు ముందు స్నానం చేసిరా."

"కాదులే, వరం. కాఫీ పడాలి ముందు. లేకపోతే నువ్వు నా కంటికి ఇద్దరుగా అగపడుతున్నావు."

నవ్వింది వరలక్ష్మి. "అయితే, రాజ్యం పెళ్లికి నీకు కాఫీ ఇవ్వకుండా కాపలా కాస్తాను. రెండుగా అగపడితే రెండు చీరలు తీసుకోవచ్చు నీ దగ్గర."

"దెబ్బ తిన్నావులే! చీర కూడా రెండుగా అగపడుతుందిగా! ... ముందు కాఫీ తెప్పించు, చిట్టితల్లీ, లేకపోతే బయటికి పోయి హోటల్లో తాగొస్తాను."

"ఆయనా ఇంతే! అస లీ హోటళ్లు మూస్తేనే గాని మగవాళ్ల కీ అహంభావం తగ్గదు. లక్ష్మమ్మగారూ, అన్నయ్యకి మంచి కాఫీ తీసుకురండి. ఎక్కువగా తెండి."

"ఏ ఊరు వెళ్లారేమిటి బావగారు?"

"మన వైపుకే. ఎక్కడో బ్రాంచి ఆఫీసు పెడతారుట. ముం దీయన బిల్డింగు వగయిరాలు ఓ. కే. చేయాలిట. సాయంత్రం వచ్చేస్తారు."

కాఫీ రెండు గుటకలు వేసి, "చూశావా, వరం, ఒక్కొక్క గుక్క పడుతుంటే మెల్లగా రెండు వస్తువులు ఒకటిగా సింక్రొనైజ్ అవుతున్నాయి. పరమ పవిత్రమయిన ఔషధ మిది ... మరి నేను నేరుగా అసలు సినిమా ప్రారంభించనా, లేక ముందేమయినా న్యూస్ రీల్స్ కావాలా?"

"సుఖాంతం అయితే మొదలెట్టు."

"ఏ అంతం అయినా నువ్వే చేయాలి."

"చంపావుపో. ఒక్క నిమిష మాగు. నన్ను కూడా ముఖం కడుక్కోనీ. రెండు గుక్కల కాఫీ పడకపోతే నువ్వు చెప్పేది రెండు కథలుగా వినపడవచ్చు."

అవన్నీ పూర్తయాక, బుద్ధిమంతు



—సింగరాజు రామచంద్రమూర్తి

రాలయిన విద్యార్థినిలా వచ్చి కూర్చుని, చె''ప్పు మరి'' అంది.

''రాజ్యం విషయం.''

''ఏమయింది దానికి?''

''ప్రేమలో పడింది.''

మాట్లాడలేదు వరలక్ష్మి.

''రమణగాడి కొడుకున్నాడు, ఒక కుర్రాడు. మంచివాడే! చిన్నతనం నుంచి మనింటికి వచ్చిపోతుండేవాడు. ఇంతటివా డవుతాడని అనుకోలేదు.''

తల ఎత్తి, ''మన వాళ్లేనా?'' అనడిగింది వరలక్ష్మి.

''ఉహుఁ కాదు. పైగా నాన్ వెజిటేరియన్స్ ... అయినా, ఈ ప్రేమలో పడే జనాభా కివన్నీ తెలుస్తాయంటావూ?''

మాట్లాడలేదు వరలక్ష్మి.

''అది కాదు, వరం, ఒక వయస్సులో ఇటువంటివి చాలా సహజంగా ఉంటున్నాయి. మనస్సు పరిపక్వ మయితే గాని, అందులోని సాధక బాధకాలు తెలియవు. దాని కా వయస్సు కాదు. ప్రస్తుతానికి క్షణికోద్రేకం. 'మంచివాడు. బాగుంటాడు. తెలివిగల వాడు. మనకన్నా భాగా ఉన్నవాళ్ళు. అంతకన్న మాకుమాత్రం కావలసిన దేముంది?' అంటుందిట వాళ్ల అమ్మతో... అంతేనా మనం కోరేది? ఎన్ని ఇబ్బంది లున్నాయి? మామూలుగా అన్ని సక్రమంగా ఉన్న సంసారాల్లోనే పెళ్లిళ్ళు కావడం కష్టమయిపోతే, ఇటువంటి వాళ్లకి పుట్టబోయే సంతానం గతేమిటి? ఇవన్నీ వాళ్ళు ఆలోచించరు. 'అమర ప్రేమ మాది' అంటారు. మన రాజ్యానికి కూరల్లో మసాలా వేస్తేనే పడదు. అతను మాంసాహారి! ఎన్నాళ్లని మనస్సు చంపుకుంటాడు? ... అయినా, ఇవన్నీ ఎందుకూ... ఈ పెళ్లి నా కిష్టం లేదు. అంతే!''

నవ్వింది వరలక్ష్మి. ''అలా అంటే అది వినక్కరలేదా, అన్నయ్యా? చదువుకున్న పిల్ల!''

''నా మాట వినదనేగా నే నసలు ఆ విషయం మాట్లాడనిది! నువ్వంటే దానికి విపరీతమయిన ప్రేమ, ఆరాధన. అందుకే నీ శరణు జొచ్చాను.''

''న న్నేం చేయమంటావు? ఒకవేళ నా మాట కాదంటే?''

''అనదు. అనేట్లు నువ్వు మాట్లాడకూడదు. 'చెప్పా నన్నయ్యా, లాభం లేక పోయింది' అన్న మాట నీ నోట నేను వింటే, నా పని 'హరి'. అందరూ దాన్ని నీలాగా ఉంటుందంటారు. 'అచ్చం అత్తయ్యే!' అని ఎవరయినా అంటే దానికి ఎంతో ఆనందం వస్తుంది. చెప్పాగా నీ మాటలు దానికి వేదాలు. అన్నిటా నిన్నే అనుకరిస్తుం దది. కనక ఈ బాధ్యత నీదే! ఈ పెళ్లి జరక్కూడదు. ఏ సంబంధం నువ్వు మాట్లాడినా, ఎంతయినా ఇచ్చేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. నాకూ అదొక్కటే కదా?''

''పెద్దపనే చెప్పావు!''

''ఇహ మరి మాట్లాడకు. స్నానం చేసి వస్తాను. అన్నం వడ్డించే ఏర్పాట్లు చేయమను ఆవిడని'' అంటూనే గబగబ వెళ్లిపోయాడు.

అలానే కూర్చుండిపోయింది వరలక్ష్మి. భోజనం చేసి ప్రభాకరం వెళ్లిపోయాక కూడా అలానే కూర్చుంది. ఎప్పుడో లేచి, స్నానంచేసి భోజనం అయ్యాక మంచం మీద పడుకుని కూడా ఆలోచిస్తూనే ఉంది. కొంతసేపటి కలాగే నిద్రలోకి జారిపోయింది...

''వరం! — ఇదేమిటి దీపాలెట్టే వేళయింది— ఇంకా నిద్రేనా? లే లే'' అంటూ లేపాడు మాధవరావు.

''ఎప్పు డొచ్చారు మీరు?''

''ఎప్పుడో నువ్వు పసిపిల్లగా ఉండగా వచ్చాను. చూస్తూండగానే ఎంత పెద్ద దానివయిపోయావు, వరం, ఆశ్చర్యంగా ఉంది సుమా?''

నవ్వింది వరలక్ష్మి. ''సర్లెండి గాని, వచ్చి చాలాసేపయిందా?''

''అరగం టవుతుంది. మీ అన్నయ్య వచ్చాడటగా? ఉంచకపోయావూ నే వచ్చే దాకా ! అసలు లేచావా పొద్దున్న? లేక ఇదేనా లేవడం?''

''ఇదిగో మరి ఆటగా ఉందే! పొద్దుటే వచ్చాడు పొద్దున్నే. స్నానం చేసి భోజనం చేసే లోపల చెప్పవలసింది చెప్పి వెళ్లి పోయాడు.''

''అంతా కులాసాయేనా?'' ఆమెనే చూస్తూ అడిగాడు మాధవరావు.

''కులాసాకేం తక్కువ! మనస్సులు మాత్రం కులాసాగా లేవుట.''

''ఉహుఁ.''

''ఉహుఁ ఏమిటి నా తలకాయ! కొంప అంటుకున్నాయిట.''

''ఉహుఁ నీ బుగ్గ మీద అదేమిటి— చీమా పాకుతోంది?'' అంటూనే వేలో దులిపాడు.

''మా రాజ్యం లేదూ... స్వరాజ్యలక్ష్మి అంది...''

''ఉహుఁ. వీపు మీద ఏమిటోయ్, సాలీడా?''

మాట ఆపేసి అతని వంక చూస్తూ, ''వినేదుందా? చీమల్ని, దోమల్ని తోలడమేనా?'' అంది.

''కాంపుకి వెళ్లి వచ్చిన మనిషితో చెప్పే దిటువంటి పోదా? ఎంత కష్టపడి వచ్చానూ, ఏమిటి కథ!'' అంటూ మంచం మీద కూర్చున్నాడు.

''సర్లెండి. ఇదొక్కటే వినండి. చాలా ముఖ్యం ఇది కూడా! మా రాజ్యం ఎవరినో కుర్రాడిని ప్రేమించిందిట!''

''రాజ్యం ఎవరు?''

''అన్నయ్య కూతురండి.''

''ఓహో! తెలివి గలది. ముహూర్తం పెట్టించేస్తే పోలా — కట్నం పైసా లేకుండా?''



"మీ కూతురే అయితే ఇంత తేలిగ్గా మాట్లాడగలరా మీరు? పెళ్ళంటే ఎన్ని ఆలోచించాలి?"

"అవునవును. ఆలోచించమను. తొందరేముంది? ఇంకా చిన్న పిల్లేగా!"

"చిన్నపిల్లేమిటండి నా ముఖం! పద్దెనిమిది దాటితేను."

"ఎవరికి?"

"రాజ్యాని కండి, బాబూ!"

"అవునవును."

"అదిప్పుడు ప్రేమలో పడిందిట."

"చేసేస్తే పోలే?"

"మళ్లీ మొదటి కొచ్చారు. ఒక్క అయిదు నిమిషాలు మాట్లాడకుండా వినండి, స్వామీ!"

"చిత్తం."

"మా రాజ్యం — అన్నయ్య కూతురు లెండి — ఒకబ్బాయిని ప్రేమించిందిట. వాడినే చేసుకుంటానని అంటోందిట. ఆ కుర్రవాడూ మంచి వాడే. అయితే..."

"అయితే, మరింకేమిటి? చేసేస్తే పోలే?"

నవ్వింది వరలక్ష్మి. "ప్రేమించుకున్న వాళ్ళని మీ దగ్గరకు పంపాలి అసలు. నిమిషాల మీద పెళ్లిళ్ల చేసేస్తారు."

"కాకపోతే మరేమిటోయ్! మంచివా డంటున్నావుగా?"

"అతను మన కులస్థుడు కాదు. పోనీ, అనుకున్నా, కనీసం శాఖాహారి అయినా కాదు."

"అదొకటుం దేమిటి! అయితే, చాలా కష్టం. మన కొంపల్లో ఎన్ని ఆధరువులు వేసి పెట్టినా వాళ్ల పదార్థం పడనిదే భోజనం చేసినట్లుండదు వాళ్లకి."

"ఇప్పటికి చేరింది మీ మనసులోకి నా గోల. దానికి నచ్చ చెప్పి ఇది తప్పించే బాధ్యత నా మీద వేసి పోయాడు అన్నయ్య. ఏం చేద్దా మంటారు?"

"చేసేద్దాం."

"ఎలాగండి, బాబూ!"

"ఏమిటి ఎలాగు?"

"అదేనండి — పెళ్లి!"

"ఎవరికి? ... కాటుక పెట్టుకోలేదేం మ ప్పీ రోజు? కళ్లు బోసిపోతున్నాయి."

"సర్లెండి. మీ రింక మాటలని అర్థం చేసుకునే స్థితిలో లేరు. పదండి, స్నానం చేద్దురు గాని."

మరునాడు పొద్దున్నే చెప్పింది వరలక్ష్మి భర్తతో — "చూడండి, మీరు వారం రోజులు సెలవు పెట్టబోతున్నారు" అని.

"ఎందుకో?"

"ఎందు కేమిటి, అదంతే! నా మాట కెదురు చెప్పకూడ దీ వారం రోజులూ. నే నేం చేసినా, ఏం మాట్లాడినా మీరు పట్టించుకోకూడదు."

"అదేమిటి క్రైక వరాల్లాగ!"

"వెధవ పోలిక! మనం మా అన్నయ్య గారి ఊరు వెడుతున్నాం."

"ఎందుకో?"

"ఎందుకేమి టండీ ఖర్మ, రాజ్యం పెళ్లి ..."

"ఎప్పుడేమిటి?" అన్నాడు మత్తు వదిలిపోయిన మాధవరావు.

"అయిపోయింది లెండి. మనం పెళ్లి కూతురుతోబాటు మూడు నిద్రలకి వెళ్లాలి. లేవండి మరి."

"అది కాదోయ్, నిద్ర లేచీ లేవ కుండానే సెలవు పెట్టమంటున్నావు."

"వారం రోజులు — అంతే! తరవాత మీరు వస్తున్నట్లు అక్కడి మీ బ్రాంచి ఆఫీసు వాళ్లకి రాయండి. వాళ్లం దరూ స్టేషనుకి రావాలి."

"వస్తారు. అయినా, ఎందు కివన్నీను?"

"అడగకూడ దన్నాను. వారం రోజులు నేను చెప్పినదే వేదం మీకు. అక్కడ మీ లయన్స్ క్లబ్బు లాంటివి ఉన్నాయా?"

"ఉన్నాయి."

"వాళ్లకి కూడా మీరు వచ్చే కబు రంపాలి. మీటింగు పెడతారుగా?"

"ఎందుకో చెప్పు? నీ ఉద్దేశ్యం అర్థ మయితే!"

చెప్పింది వరలక్ష్మి. నవ్వేశాడు మాధవరావు. "ఇంతే కదా! ఇక పద, రాక్షస మాయ చూపిద్దాం."

"అన్నట్లు మీ ప్రథమ శిష్యుడు రవికుమార్‌ని కూడా రమ్మనండి."

"అలాగే" అన్నాడు నవ్వుతూ మాధవరావు.

ట్రెయిన్ దిగిన వరలక్ష్మికి, మాధవ రావుకి మెడలో పూల దండలు అయిదారు పడ్డాయి. ఎవరికి వారు దండ వేసి నమస్కారం పెట్టి వినయంగా పక్కన నిలబడుతున్నారు.

ఇవన్నీ చూస్తూ వెనగ్గా నిలబడి ఉంది రాజ్యం.

"అదేమిటి, రాజీ! రా, రా. వెడంగా నిలబడిపోయా వేమిటి?" అంటూ రాజ్యాన్ని చేయి పుచ్చుకుని అందరి మధ్యకు తీసుకు వచ్చి, "మా మేనకోడలు, రాజ్యం బి. ఎస్‌సి." అని పరిచయం చేసింది వరలక్ష్మి.

అందరూ నమస్కారాలు పెట్టారు.

ఒకావిడ గభాలున ముందుకు వచ్చి రాజ్యం భుజంమీద చనువుగా చేయేసి, "నే నిందాకమంచి అదే చెబుతున్నాను మా మువర్చలతో — 'అచ్చం వరలక్ష్మి

పార్క్-డేవిస్
త్రివిధోపయుక్తమైన
# నికో సబ్బు
చర్మసంరక్షణకు సబ్బు లన్నిటిలో సాటి లేని మేటి

1 నికో చర్మక్రిములను సంహరిస్తుంది
2 నికో చెడు వాసనలను అరికడుతుంది
3 నికో చర్మమును సుందరంగా ఉంచుతుంది

చర్మమును ఆరోగ్యవంతంగా ఉంచుకొనుటకు, నికో సబ్బుతో ప్రతి రోజూ స్నానం చెయ్యండి. దాని యాంటి సెప్టిక్ గుణం గల నురుగు చర్మ క్రిములను సంహరిస్తుంది.
నికో యొక్క ఔషధ గుణాలు చర్మంనుండి చెమట వాసనలను హరిస్తాయి.
మీ చర్మ ఆరోగ్యం దినదినాభివృద్ధి చెందుతుంది.
నికోలో ఉన్న శక్తివంతమైన క్రిమినాశక పదార్థం చర్మ వ్యాధులను నిరోధించి, మీ చర్మమును తేజోవంతంగా, చైతన్యవంతంగా నిత్యనూతనంగా ఉంచుతుంది. చెమటకాయలు, మొటిమలు వగైరాల నికో మీ చర్మమును రక్షిస్తుంది. నికోతో ప్రతిరోజూ శుభ్రపరచుకుంటే, చుండు రాకుండా కాపాడుతుంది.
మీ చర్మపు ఆరోగ్యమును, లావణ్యమును రక్షించుకొనుటకు, మూడు విధముల లాభదాయకమైన నికో వాడటం నేడే ప్రారంభించండి.
మీరు నికో సబ్బు వాడటం అలవాటు చేసుకోండి
ఇది మీ చర్మ సంరక్షణకు చాలా అవసరం.




® Regd. Trade Mark. Regd. Users—Parke Davis (India) Ltd., Bombay-72 AS.

# ‘సోల్వా సాల్’

(15 వ పేజీ తరువాయి)

పరుగు పందెం ... నిన్న నీకు పరిచయం అయిన అమ్మాయిల కోరికలు విన్నావుగా? అందులో అయిదుగురికి డాక్టర్ల సంబంధాలు చూస్తున్నారు. ఆ వృత్తికి తప్ప మిగిలిన వాటికి పైస పుట్టడం లేదు ఇప్పుడు. అందుకనే డాక్టర్లకోసం, ఆఫీసర్లకోసం రష్! కారు, పలుకుబడి ఉంటాయి. ఈ రోజులలోని నిజాలు తెలిసినవాళ్ళు కనక వాళ్ళని తెలివిగలవాళ్లంటాను నేను.” అని కాసేపాగి, “నేనూ నా పెళ్లి గురించి తెగించి ఒక నిర్ణయానికి రాకపోయి ఉంటే ఈపాటికి ఒక మామూలు ఇంటి వంటఇంట్లో పడుండే దాన్ని” అంది.

ఆశ్చర్యపోయింది రాజ్యం. “ఏమిటత్తయ్యా ను వ్వనేది?” అంది.


“అవును, రాజీ! మా ఇంటి పక్కన గిరి అనే కుర్రాడొకడు ఉండేవాడు. అతను మంచివాడు. తెలివిగలవాడే! కాని, బీదవాడు. నాకు తెలియని పాఠాలు చెబుతుండేవాడు. చిన్నతనం నుంచి కూడా నేనంటే అతనికి ఆరాధన! మీ నాన్న నన్నేమయినా అంటే అతను ఊరుకునేవాడు కాదు. ఒకసారి అన్నయ్య పెన్ను నేను తీసుకున్నందుకు నన్ను వాడు చేతిలోని కర్ర పెట్టి ఒక దెబ్బ వేశాడు. అది ఖర్మకాలి నా బుగ్గమీద చీరుకుంది. గిరి ఉండగా అతని ముందు జరిగింది అంతా. అంతే — నేను అడ్డం పడుతున్నా ఊరుకోకుండా అన్నయ్యని బాది పారేశాడు. మళ్లీ వాళ్ల మధ్య విపరీతమయిన స్నేహం ఉంది!

నేను కొండమీద కోతిని తెమ్మంటే తెచ్చేవాడు. ఎంతటి అసాధ్యమయినదయినా నే నడిగానంటే అతని కది వేదమే! చిన్నప్పుడలా తెలియని చిలిపితనంతో పెరిగిన నాకు సహజంగానే పెద్దయేసరికి అది ‘ప్రేమ’ అన్న విషయం అర్థమయింది. ఒక్క రోజు కూడా అతణ్ణి చూడకుండా ఉండలేక పోయేదాన్ని.

అన్నయ్యకి కూడా మా మధ్య గల సయోధ్య ఇష్టమే! మొదట ఇంట్లో వాళ్ళు మా మధ్య గల స్నేహం ప్రేమగా మారుతుండటం గ్రహించలేకపోయారు. ‘మా ఇంట్లో వాళ్ళు’ అంటే అమ్మ, నాన్న గారు కాదు. తాతయ్య! నేను, ప్రభాకరం ఆయనకి రెండు కళ్ళు. మమ్మల్ని పెంచినది ఆయనే! ఆడపిల్లని కావడాన నేనంటే విపరీతమయిన ప్రేమ. తెగ గారాబం చేసేవాడు నన్నాయన.

ఎప్పుడూ పూజలూ, జపాలూ చేసే వారు తాతయ్య. అంతెత్తు మనిషి. పూజా మందిరంలో కూర్చుని ఉన్నప్పుడు ఆయన్ని చూస్తే ఎక్కడలేని భయం, భక్తి కలిగేవి. బయటికి వస్తే మాత్రం మళ్లీ పిల్లాడి లాగా ఆడుకునే వాడు మాతో. అందుకే నే నెప్పుడూ ఆయన్ని పూజలో ఉండగా చూసేదాన్ని కాను.

నాకు కాలిలో ముల్లు గుచ్చుకుంటే భోజనం మానేసేవా రాయన. ఒకసారి ఏమయిందో తెలుసా? నాకు విపరీత



మయిన జ్వరం వచ్చింది. రెండు మూడు రోజులు అలా బాగా ఉండేప్పటికి 'అమ్మవారు జ్వరం' అన్నా రంతా! ఇంటిల్లిపాది భయపడిపోయారు. 'నా బంగారు బొమ్మని ఏ అమ్మ వారు పాడుచేస్తుందో చూస్తాను' అంటూ పూజా మందిరంలోకి వెళ్లిపోయి కూర్చున్నారు తాతయ్య. ఆయన్ని పిలిచేందుకు అందరికీ భయమే! తిండి, నీళ్లు మానేశారు.

మరి ఎందువల్లనయినా గాని నాకు జ్వరం తగ్గి నేనే వెళ్లి పిలిచా నాయన్ని! అంత నిష్ఠాపరుడు తాతయ్య.

ఇరవై సంవత్సరాల లోపు ఆడపిల్లలకి మనస్సు పరిపక్వం కాదని నా నమ్మకం. ఈ నమ్మకం వచ్చింది తరవాతి జీవితంలో! ఆ ఇరవై సంవత్సరాల లోపు వయస్సులో మనస్సు కేది తోస్తే అదే రైటనుకుంటాం. 'అర్థం చేసుకోవడం లేదు నన్ను' అని బాధపడతాం. అయితే, ఎంతటి అనుభవం మీాద మిగిలిన వాళ్లు చెబుతున్నారో గ్రహించలేని ఉద్రేకపు రోజు లవి.

'గిరిని తప్ప ఎవరినీ పెళ్లి చేసుకోను' అని తెగేసి చెప్పాను అమ్మతో.

ఇంటిలోని అందరూ స్తంభించి పోయారు, నా నిర్ణయం విని. ఎవ రేం చెప్పినా వినలేదు నేను. రాబోయే పరిణామాలు చెప్పారు. పిల్లల భవిష్యత్తు గురించి భయపెట్టారు.. 'ముందు మా భవిష్యత్తు ఆలోచించండి' అన్నాను.


వీళ్లందరూ ప్రయత్నాలు చేసినంత కాలం తాతగారు రంగంలోకి దిగలేదు. ఆయన గురించే నా భయం కూడా! అయితే, ఆయన పల్లెత్తు మాట అనక పోయేసరికి ఆయనకి అభ్యంతరం ఉండకపోతే బాగుండునని ఆశపడ్డాను.

అందరికీ మొండిగా చెప్పాను— 'గిరి కాకపోతే నాకు పెళ్లే అక్కరలే' దని.

రోజూ భోజనాల దగ్గర కూర్చుని జపం అయ్యాక తాతగారు గంట మోగించటం, అందరం భోజనాలకి వెళ్లడం అలవాటు.

ఒక రోజు అది వినపడలేదు. చూస్తే తాతగారు పూజ గదిలోంచి బయటికి రాలేదు. 'నా వయస్సు డెబ్బయి నాలుగు. వరం వయసు పద్దెనిమిది — నాలుగవ వంతు. నా అనుభవం అది చేస్తున్నది తప్పని చెబుతోంది. దానికి చెప్పే ధైర్యం లేదు నాకు. ఒప్పించగలనన్న నమ్మకమూ లేదు. తెలిసి తెలిసి నా ప్రాణం లాగా పెరిగినది తప్పు చేస్తుంటే భరించలేను. ఈ దేముడిని నమ్మాను. ఇక్కడ నుంచి ఇక రాను. తలుపు వేసి వెళ్లండి' అన్నారు నాన్నతో.

రెండు రోజులు భరించగలిగా నీ బాధ!



ఏకాంత సేవ

ఫోటో— వి. బి. ఎస్. గాంధి ( కొవ్వూరు )

ఇల్లంతా వేడెక్కిపోయిన ట్లయింది. అందరూ దిగులుగా ఉన్నారు. నన్ను ఒక్క మాట అనడం లేదు. నాతో మాట్లాడటం లేదు. దిగులు, తాతయ్య ఏమయిపోతారో నన్న భయం.

మూడవ రోజు ఇక భరించలేక పోయాను. గభాలున తాతయ్య గదిలోకి వెళ్లి, 'తాతయ్యా! నీ ఇష్టం వచ్చినట్లు నడుస్తాను. భోజనం చేద్దువుగాని రా' అని పిలిచాను.

కళ్లు తెరచి చూసి నా చేయి పుచ్చుకుని ఇవతలికి వచ్చా రాయన. తరవాత మీా మామయ్యగారి సంబంధం తాతయ్యే చూశారు. ఇలా ఉన్నాం!'' అని నవ్వి, ''మామయ్యగారు మామూలు ఉద్యోగి అయితే 'కాకి ముక్కుకి దొండ పండు' అనిఉండేవారు ఆయన్ని, నన్ను! కాని ఆయన చదువు, ఉద్యోగం ముందు అవేవీ ఎవ్వరికీ అనిపించలేదు. అనిపించవు కూడా! మగవాడికి అందం కాదు ముఖ్యం. మంచి మనస్సు, కడుపు నిండిన విద్య! ఆ రెండూ పుష్కలంగా ఉన్నవా రాయన. న న్నెట్లా చూసుకుంటారో చూస్తున్నావుగా'' అంది వరలక్ష్మి.

''దేవతవి మ వ్వాయనకి'' అంది రాజ్యం.

వరలక్ష్మి నవ్వింది. ''నాకూ ఆయన దేముడే! అంతకన్న నా క్కావలసిం దేముంది? దేనికీ లోటు లేదు. చిటికె వేస్తే నాలుగు కార్లు వచ్చి ఆగుతాయి. పది మంది జవానులు వస్తారు. చూస్తున్నావుగా, ఎక్కడ ఆయన పాదం పెడితే అక్కడ ఎంతమంది నమస్కారాలు పెడుతున్నారో! ఆయన వలన నాకూను.

నా మనస్సు తెలుసుకుని ప్రవర్తించే మనిషి ఆయన ... ఆ నాడు తాతగారి నిర్ణయానికి నా భవిష్యత్తు వదలడం మంచిదయిం దనిపిస్తుంది నాకు.''

రాజ్యలక్ష్మి ఏమీా మాట్లాడలేదు. తల వంచుకుని కూర్చుంది.

''ఇంకోటి, రాజీ, బుర్ర ఉపయోగించి ఆలోచిస్తే ప్రేమ పెళ్లిళ్ల వలన చాలా బాధ లగపడతాయి. కేవలం అందాలు చూసి మొదలవుతాయి ఈ ప్రేమలు. పునాది లేని ఇళ్లలాంటి వివి. సాధారణంగా అయినవాళ్ల సామభూతి ఉండదు.

ఈ ప్రపంచంలో బ్రతకాలంటే అందరి అండదండలూ ఉండాలి, తెలుసా? 'మనకేంలే' అని బ్రతకలేం. ఎప్పుడో ఒకప్పుడు ప్రతి వారితోను అవసరం రావచ్చును.

అనుభవం నాకు నేర్పిన పాఠం ఏమంటే— అన్ని విషయాలలోనూ మన శ్రేయస్సుని చూసేవాళ్లు, మనమంటే అభిమానించే వాళ్లు ఉన్నప్పుడు మన భవిష్యత్తుని చూసే అవకాశం కూడా వాళ్లకే ఇవ్వడం మంచిదని! కొన్నాళ్ళు మనస్సుకి బాధ ఉన్నా తరవాత సంసారంలో పడి అన్నీ మరిచిపోతాం ... ఏమంటావు?''

''నీ ఇష్టం, అత్తయ్యా'' అంది రాజ్యం.

లేచి ఆమె బుగ్గ మీాద ముద్దు పెట్టుకుని, '' 'అన్నీ అత్తయ్య పోలికలే' అని అందరూ అంటారు నిన్ను. ఇందులోనూ నా పోలికే నువ్వు. ముందు కూడా నాలాగే సుఖపడేందుకు ఏర్పాట్లు నేను చేస్తాను'' అని క్షణం ఆగి, ''రవికుమార్ అంటే నీ కిష్టమే కదూ?'' అంది.

తల వంచుకుని, ''ఊఁ'' అంది రాజ్యం.

''మరి ఇందాకా అతణ్ణి అంతలా అదరకొట్టేశావేం? పాపం! ఖంగారుపడి పోయాడు—నీకు కోపం వచ్చిందేమోనని.''

రాజ్యం నవ్వి, ''ఊరికేనే!'' అంది.

''పెళ్లికొడుక్కి నువ్వు నచ్చావు. ఇంక వాళ్ల పెద్దవాళ్లని పిలిపించమని చెబుతాను మామయ్యగారికి'' అని గబగబ బయటికి వెడుతుంటే వెనకనుంచి పిలిచింది రాజ్యం. వరలక్ష్మి ఆగి, ''ఇంకా ఏమయినా సందేహాలూ, కోరికలూ ఉన్నాయా?'' అంది నవ్వుతూ.

క్షణం సందేహించి — ''మీా ... అదే ... గిరి అనే ఆయన ఇప్పు డెక్కడున్నాడు?'' అనడిగింది రాజ్యం.

వరలక్ష్మి ఆ అమ్మాయి వంక చూసి, ''ఉద్యోగం చేసుకుంటున్నాడు. నిన్న మన ఆఫీసు వాళ్ల నాటకంలో కూడా ఉన్నాడు. ఇప్పు డతనికి పిల్లలు కూడా'' అని నవ్వుతూ గదిలోంచి బయటికి వెళ్లిపోయింది.

గుమ్మంలోనే ఎగవడిన మాధవరావుని చూసి క్షణం నిలబడిపోయి తరవాత నవ్వి, ''ఎంతసేపయింది వచ్చి?'' అంది.

''భలేగా కథలు చెప్పగలవోయ్ నువ్వు! పిచ్చిపిల్ల నమ్మేసింది. ఒక నవల వ్రాయరాదూ?'' అన్నాడు దగ్గరకు తీసుకుంటూ.

''మరి ఏమీా చెప్పకపోతే అన్నయ్య కిచ్చిన మాట నిలుపుకోవడ మెలా? రండి, అన్నయ్య కి శుభవార్త చెప్పాలి. అన్నట్టు, ముఖ్యమయినది రవీ వాళ్ల అమ్మను, నాన్నగారిని రమ్మనమని టెలిగ్రామ్ ఇవ్వండి. కోడల్ని చూసుకుంటారు.''

''వండర్‌ఫుల్! అయితే, నువ్వు మీా అన్నయ్య దగ్గరకు పద — నే వెళ్లి ఆ ఏర్పాట్లు చేసి వస్తాను. శుభ లేఖలు కూడా వేయించేయమంటావా?'' అని నవ్వుతూ వెళ్లిపోయాడు మాధవరావు.

'కథలు చెప్పగలనుట! అమాయకపు మహారాజు! ఇందులో అక్షరం కూడా అబద్ధం లేదని తెలియదు' అని నవ్వుకుంది, అతను వెళ్లిన దిక్కే చూస్తూ. ✳